క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన

సత్యవేడు: పట్టణంలోని సచివాలయం-2లో గురువారం ఉదయం 11 గంటలకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

నేడు 2వ విడత ట్యాబ్‌ల పంపిణీ

శ్రీకాళహస్తి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో భువనేశ్వరి బుధవారం తెలిపారు. మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ట్యాబ్‌లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్‌పై హర్షం

నగరి : దివ్యాంగులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ మరువలేనిదని దివ్యాంగుల సంఘం మండల నాయకుడు టీఎం కేశవన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వ అమలు చేస్తున్న అన్ని స్కీమ్స్‌లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీచేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో బుధవారం సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పారిశుధ్య చర్యలు చేపట్టారు. వీధుల్లోని ముళ్లపొదలను జేసీబీతో తొలగించి, కాలువల్లోని పూడికను కార్మికులతో తొలగించారు. వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించారు. దోమల బెడద నివారణకు మలాథీన్ పిచికారీ చేయించారు.

సమయ పాలన పాటించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామ సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ సాయిలహరి తెలిపారు. ఆమె బుధవారం పార్లపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్పందనలో వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, చిన్నచిన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని తెలిపారు.

క్రీడా సామగ్రి వితరణ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని ఎంఎంవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానికంగా నివాసం ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లోకేష్ బుధవారం క్రీడా సామాగ్రిని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాసామాగ్రి అందజేసిన లోకేష్‌ను అభినందించారు. మున్సిపల్ అధికారులు రవికాంత్ పాల్గొన్నారు.

సైన్స్ పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రంతో విద్య

ఏర్పేడు: సైన్స్ ప్రతిభ అన్వేషణ పోటీల్లో మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.విద్య ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. బుధవారం పుత్తూరులో జరిగిన లైఫ్ స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రశంసాపత్రం, బహుమతిను అందుకున్నట్లు వివరించారు. విద్యార్థినిని హెచ్‌ఎం, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు దామోదరంరెడ్డి అభినందించారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురంలో జరిగిన దాడి ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. కొత్తవీరాపురం గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్, తల్లి మల్లీశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన బొజ్జయ్య, నిర్మలమ్మ, ప్రసాద్, దొరబాబు, శ్రీదేవి, శివశంకర్ దాడి చేసి గాయపరచినట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బావిలో మహిళ మృతదేహం

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మహిళ (50) మృతదేహాన్ని గుర్తించినట్లు బుధవారం రాత్రి సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ వివరాలు.. సీతారాంపేట వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు 500 మీటర్ల దూరంలోని వ్యవసాయ బావిలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి సీఐ చేరుకుని పరిశీలించారు. మృతురాలు మెడలో స్పటిక మాల ధరించి ఉంది. కాళ్లకు రక్తగాయాలు ఉన్నాయి. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్రీడలతో ఆరోగ్యం..ఆనందం

- గిరిజన గురుకుల విద్యాలయాల స్పోర్ట్స్ మీట్‌లో డీఈఓ శేఖర్
- 41 విద్యాలయాల నుంచి పాల్గొన్న 1,025 మంది విద్యార్థులు



సరదాగా పరుగు పందెంలో డీఈఓ శేఖర్



జోన్-4 స్పోర్ట్స్ మీట్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈఓ శేఖర్

రేణిగుంట: క్రీడలతో ఫిట్‌నెస్‌తోపాటు ఇమ్యూనిటీ పెరిగి ఆరోగ్యంగా ఉండవచ్చని తిరుపతి డీఈవో శేఖర్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని, క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర' వంటి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలో ఉన్న ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయం(బాలురు)లో బుధవారం రాయలసీమ జిల్లాల జోన్-4 మూడు రోజుల స్పోర్ట్స్ మీట్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని 41 గిరిజన గురుకుల విద్యాలయాల నుంచి 1,025 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రవికాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ చదువులతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఆయన సూచించారు. అనంతరం పరుగు పందెంలో సరదాగా పాల్గొని క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి సూర్యనారాయణ, ఎంఈవో-2 రంగనాథ్, ఈవోపీఆర్‌డీ వెంకటరత్నమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాసులు, స్పోర్ట్స్ కమిటీ కోఆర్డినేటర్ రాందేవ్, వైఎస్సార్ సీపీ నాయకులు శేషారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, పీడీలు పాల్గొన్నారు. కాగా, క్రీడా పోటీలకు, మూడు రోజుల బసకు చక్కని ఏర్పాట్లు చేయడంపై వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.



పరుగుపందెంలో విద్యార్థులు

స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల అందజేత



స్మార్ట్ ఆరోగ్యశ్రీకార్డులు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 17వ వార్డు సచివాలయంలో బుధవారం నూతన ఫీచర్స్‌తో ఉన్న స్మార్ట్ ఆరోగ్యశ్రీకార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యరంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. పేదలు ఎవరూ వైద్యం కోసం అప్పులు పాలుకాకుడనే ఉద్దేశంతో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచారని గుర్తుచేశారు. ఈ సువర్ణ అధ్యాయానికి రాష్ట్ర ప్రభుత్వం స్వీకారంచుట్టడం పేదలకు వరమన్నారు. అనంతరం స్మార్ట్ ఆరోగ్య శ్రీకార్డులను అందజేశారు. లబ్ధిదారులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పీవీఆర్ గ్రూప్స్ అధినేత జనార్దన్ పవార్, వక్ఫ్ బోర్డు తిరుపతి జిల్లా చైర్మన్ సిరాజ్‌బాషా, నాయకులు ఫరీద్, గోరా, ఫజల్, అస్లాం, లాల్ బాషా, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు సేవా కార్యక్రమాలు

శ్రీకాళహస్తి: పట్టణంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8.30గంటలకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పార్టీశ్రేణులు ర్యాలీగా వైఎస్సార్ విగ్రహం వరకు చేరుకుంటారని, అక్కడ కేక్ కటింగ్, పేదలకు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తప్పక పాల్గొనాలని కోరారు.

కేవీబీపురం మండలంలో..

కేవీబీపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం పలు సహాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య తెలిపారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని రోగులకు దుప్పట్లు, పాలు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వందశాతం పనిదినాలు కల్పించాలి

కేవీబీపురం: ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న కూలీలకు వందశాతం పనిదినాలు కల్పించాలని సిబ్బందికి ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెరువులు అన్నీ నిండడంతో పంట కాలువల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెరిందేశం, ఆదవరం, కొత్తూరు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న మట్టి రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్లకృష్ణయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు గిరిజనకాలనీవాసులకు సూళ్లూరుపేట షార్ లైన్స్ క్లబ్ వారు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం సంతవేలూరు శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 కుటుంబాలకు దుప్పట్లను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి, సభ్యులు బాబురెడ్డి, శ్రీనివాసులు జెట్టి, బీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను జియో ట్యాగింగ్ చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని విద్యుత్ స్తంభాల వివరాలు జియోట్యాగింగ్ చేయాలని సూళ్లూరుపేట డీఎల్‌పీఓ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పారిశుద్యం, తాగునీటి వసతి, వీధిలైట్లు నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం కాళమనాయుడుపేట సచివాలయాన్ని తనిఖీ చేశారు. నగదు రహిత ఇంటి పన్ను వసూళ్లపై అవగాహన కల్పించారు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ ముని రవికుమార్ పాల్గొన్నారు.

సిగ్నల్ ఫ్రీగా పూర్ణకుంభం సర్కిల్

తిరుపతి క్రైమ్: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పూర్ణకుంభం సర్కిల్‌ను సిగ్నల్ ఫ్రీ సర్కిల్‌గా చేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మున్సిపల్, ఆఫ్కాన్ ఇంజినీర్లతో కలిసి బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నలువైపుల నుంచి పూర్ణకుంభం కూడలికి చేరుకునే వచ్చే వాహనదారులకు ఫ్రీ యూటర్న్ ఉండేలా మార్పులు చేయాలని కోరారు. ఏఎస్పీలు, డీఎస్పీలు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

బాలలు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలి



మేళాను ప్రారంభిస్తున్న ఎంఈఓ బాలయ్య

శ్రీకాళహస్తి : బాలలు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారి అంబటి బాలయ్య అన్నారు. పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి విజ్ఞాన మేళా నిర్వహించారు. మేళాను ఎంఈవో ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. మండల స్థాయిలో విద్యార్థి వ్యక్తిగత విభాగం కింద ఊరందూరు హైస్కూల్ విద్యార్థి సి.నందు, ఆంధ్రప్రదేశ్ సంక్షేమ గిరిజన ప్రతిభ పాఠశాల, రాజీవ్‌నగర్ విద్యార్థి ఎస్. ప్రీతిసింగ్సన్, గ్రూపు విభాగం నుంచి శ్రీకాళహస్తి హైస్కూల్ విద్యార్థులు వై.చేతస్‌సాయి, సీహెచ్ గణేష్, ఉపాధ్యాయ విభాగం కింద ఆర్పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కె.మధుసూదన్‌రావు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వారిని ఎంఈవో అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆణిముత్యాలను గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్ర'



సత్యవేడు: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల అధికారులు

సత్యవేడు: గ్రామీణ స్థాయిలో క్రీడా ఆణిముత్యాలను గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. బుధవారం తాడేపల్లె నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, పీఈటీ, పీడీల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. టీమ్‌ల ఏర్పాటు పై దృష్టి సారించాలని, క్రీడా మైదానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎంఈఓ కె.రవి, ఎంఈఓ-2 ఉష ,పీఈటీలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మనసును కదిలించిన సాంఘిక నాటకం



కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: నేటి సమాజంలో కుటుంబ వ్యవస్థలో మారుతున్న పిల్లల తీరు, ఫలితంగా పెద్దలకు ఎదురవుతున్న కష్టాలను సాంఘిక నాటికలు ఆవిష్కరించి ప్రేక్షకుల మనసులను కదిలించాయి. ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ వార్షిక కళోత్సవాల్లో మూడో రోజు బుధవారం మహతి కళాక్షేత్రంలో పలు సాంఘిక, పౌరాణిక నాటకాలు, నృత్యాలు ప్రదర్శించారు. అంతకు ముందు కళాకారులు, పిల్లలకు శాస్త్రీయ నృత్య, భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు కళాకారులకు పారితోషికం, జ్ఞాపికలు అందజేశారు

పారదర్శక సేవలకే సచివాలయాలు



కీళగరం సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ పారదర్శక ప్రభుత్వ సేవలను సచిచివాలయాల ద్వారా మాత్రమే అందుతోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కీళగరంలో రూ. 35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సేవలతో పాటు సంక్షేమ పథకాలను అర్హతే ప్రమాణికంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దే అని అన్నారు. సంక్షేమ, పారదర్శక పరిపాలన నిర్విరామంగా కొనసాగాలంటే రాష్ట్రానికి జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా మరోసారి చేయాలని ఆయన అన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీడీవో కృష్ణమూర్తి, పీఆర్ డీఈ మధుసూదన్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచ్‌లు రామ్మూర్తి, సాయిరవి, ధర్మలింగం, మురుగేశం, గుణశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, రమేష్, మాజీ సర్పంచ్ షణ్ముగం, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శనేశ్వరస్వామి పరిహార పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలోని శ్రీమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో శ్రీశనేశ్వరస్వామికి బుధవారం భక్తిప్రపత్తులతో పరిహార పూజలు నిర్వహించారు. బుధవారం శనీశ్వరుడు మకర రాశి నుంచి కుంభ రాశిలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ప్రదోష మండపంలో శనీశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఎమ్మెల్యే ఆదిమూలం ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, బోర్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాగలాపురం మండల అధ్యక్షుడు అపరంజిరాజు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగనన్న పాలనలో సాకారమవుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని పాపానాయుడుపేటలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ముందుగా జెండా ఆవిష్కరణ చేసి, వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో సమూల మార్పులు తెచ్చారన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. సంక్షేమ సారథి జగనన్న అని పేర్కొన్నారు. మరోమారు సీఎంగా జగనన్నను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై చేకూరిన లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. రాత్రి పల్లె నిద్ర చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, నాయకులు కరుణాకరన్, దామోదరంరెడ్డి, రాంబత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



పథకాల బోర్డును ప్రారంభిస్తున్న గవర్లకృష్ణయ్య

కేవీబీపురం: ఇచ్చిన హామీలను నెరవేర్చి, సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తిమ్మసముద్రం సచివాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తిమ్మస ముద్రం గ్రామ ప్రజలకు రూ.26.19 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. జగనన్న పథకాల ద్వారా ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. అనంతరం పథకాల లబ్ధి వివరాలను తెలిపే బోర్డును ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. నేతలు నందకుమార్, లాల్ బాబుయాదవ్, నాగరాజు, రామ్మోహన్‌వర్మ, బొర్రా మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనువాసులు యాదవ్, ఎంపీటీసీ బొబ్బిలి వసంత, ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

26న రంగా విగ్రహావిష్కరణ



మోహనరంగా విగ్రహం వద్ద నాయకులు

శ్రీకాళహస్తి: ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 26న ఆయన విగ్రహా విష్కరణ చేయనున్నట్లు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. పేదల పక్షపాతి, కార్మిక వర్గ నాయకుడైన వంగవీటి మోహనరంగ విగ్రహాన్ని శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేయాలని జూన్‌లో ఆయన జయంతి సందర్భంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి రోడ్డులో దక్షిణ కైలాసనగర్‌కు వెళ్లే సర్కిల్ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీలు, కులాలకతీతంగా రంగా అభిమానులు తరలి రావాలని కోరారు. పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, కృష్ణయ్య, సెన్నీరుకుప్పం శేఖర్, మండల బాలాజీ, కంఠా ఉదయ్, పత్తి మణి, పుల్లయ్య, ప్రసాద్, గరికపాటి చంద్ర, చక్రాల మురళి, తీగల భాను, తేజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమరరాజ వ్యవస్థాపక దినోత్సవం



గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అవార్డులు అందిస్తున్న అమరరాజ యాజమాన్యం

రేణిగుంట: కరకంబాడిలోని అమరరాజ కర్మాగారం 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కంపెనీ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. లెఫ్టినెంట్ మాజీ గవర్నర్, భారతదేశపు తొలి మహిళా ఐపీఎస్ కిరణ్‌బేడీ, అమరరాజ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గౌరినేని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ 1985లో ప్రారంభమైన ఈ కంపెనీ 16వేలకు పైగా ఉద్యోగులతో 1.75 బిలియన్ డాలర్ల బహుళజాతి సంస్థగా ప్రపంచస్థాయిలో ఖ్యాతి పొందిందన్నారు. ఫౌండేషన్‌డే సందర్భంగా ముగ్గురు గ్రామీణ పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసి రూ.3లక్షల చొప్పున నగదు అవార్డులను ప్రదానం చేశారు. అమరరాజ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

తుపాన్‌తో 54 హెక్టార్లలో పంట నష్టం

వరదయ్యపాళెం: మిచాంగ్ తుపాన్ కారణంగా మండలంలో మండల వ్యాప్తంగా189 మంది రైతులకు సంబంధించి 54 హెక్టార్లలో పంటలు కోతకు గురైనట్లు ఏఓ సుహర్‌లత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడు తూ పంట పొలాలు, పంట నష్టం జరిగిన రైతుల వివరాలను మండలంలోని 12 ఆర్బీకేల వద్ద నోటీసు బోర్డులో ఉంచినట్లు పేర్కొన్నారు పంట నష్టం జరిగి వివరాలు ఇవ్వనివారు ఎవరైనా ఉంటే ఆర్బీకే కేంద్రాల వద్ద వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

వాహన బ్యాటరీలు చోరీ

నారాయణవనం: మండలంలో మంగళవారం రాత్రి పలు ట్రాక్టర్, ఆటో, మోటార్ సైకిళ్ల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. నారాయణవనం, కీళగరం, వీకే పాళ్యం, సముదాయం బైపాస్‌లో పార్క్ చేసిన దాదాపు 20 వాహనాల నుంచి బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఒక్కో బ్యాటరీ విలువ రూ. 10 వేలు ఉంటుందని యజమానులు పేర్కొంటున్నారు. ఎస్ఐ రమేష్ నాయక్ వివరణ ఇస్తూ బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేసిన వాహనాల నుంచి బ్యాటరీలు చోరీ అయినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి సాయం అందిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలకు బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూద న్‌రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కందాడు పంచాయతీ సదాశివపురంలో అప్పిరెడ్డి (65), శివగిరి ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి(40), కుక్కల వారికండ్రిగకు చెందిన ఊర్మిలమ్మ(60) ఇటీవల మృతిచెందారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనల మేరకు ఆకర్ష్ రెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు నగదును అందజేసి మానవ త్వాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు కుప్పాల వెంకటేష్, యల్లయ్య, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్ రాజు, షణ్ముగంరెడ్డి, మణిరెడ్డి, నాగరాజురెడ్డి, గోపి, జడైరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.